క్లుప్తంగా

కనకదుర్గమ్మ ఆలయ గోపురం ప్రారంభం



మర్రివీడులో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: మండలంలోని మర్రివీడులో వేంచేసిన కనకదుర్గ అమ్మవారి ఆలయ గోపురం ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయానికి గోపురంతో పాటు పలు ఆధునీకీకరణ పనులు చేపట్టారు. పనులు పూర్తికావడంతో ప్రారంభించారు. దీనిలో భాగంగా అమ్మవారికి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శించుకున్నారు.

నాగలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రౌతులపూడి: శృంగవరం–మెరక చామవరం సమీపంలోని నందనవనంలో స్వయంభూ వెలసిన ఉమావర్ధినీ సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు.

తాళ్లూరులో..

గండేపల్లి: తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలతో పాటు అన్నవరం, రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

కిటకిటలాడిన అరుణాచల క్షేత్రం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి క్షేత్రం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. పండితులు సామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ పీఠాధిపతి రమణస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేదలకు వస్త్రాల పంపిణీ



మహిళలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఏడుకొండలు

గోకవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం గోకవరంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. తొలుత వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం మహిళలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గునిపే ఏడుకొండలు, ఇజ్జిన కిరణ్‌కుమార్, పత్తి రమేష్, మనోహర్‌దాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

26 మందికి కొత్త పింఛన్ల పంపిణీ



తొండంగి లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము అందజేస్తున్న వైస్ ఎంపీపీ నాగం గంగబాబు

తొండంగి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు సర్పంచ్ సోమాల ప్రసాద్‌తో కలిసి 26 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ గంగబాబు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పారేపల్లి సురేష్, రౌతు శివ గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.గోవిందు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అండర్ 14, 17 విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

పక్కాగా.. పారదర్శకంగా..

- జోరుగా ఓటర్ల జాబితాల సవరణ
- ఇప్పటివరకూ జాబితాలో చేరిన 3,925 మంది నూతన ఓటర్లు
- ఇంటి నంబర్లు లేని ఓట్లు 652
- సరిదిద్దుతున్న అధికారులు



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాలను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణ చురుగ్గా సాగుతోంది. గతంలో ఓట్ల నమోదు ప్రక్రియలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కొందరి ఇంటి నంబర్లు నమోదు కాలేదు. ఇంటి నంబరు స్థానంలో కొందరికి సున్నా (0), మరికొందరికి స్టార్, యాష్ తదితర గుర్తులు (జంక్ క్యారెక్టర్) గా నమోదు చేశారు. వాస్తవంగా ఓటర్లు ఉన్నప్పటికీ చిరునామాలో ఇంటి నంబర్ లేకపోవడం, 0 ఇంటి నంబర్ ఉండడం, జంక్ క్యారెక్టర్స్ మూలంగా ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇటువంటి ఓట్లను సరిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

నియోజకవర్గంలో 2,08,776 ఓట్లు

ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలు, ఏలేశ్వరం నగర పంచాయతీలో 2,08,776 ఓట్లు ఉన్నాయి. వీటిలో ఇంటి నంబర్లు సున్నాగా ఉన్నవి 652, జంక్ క్యారెక్టర్లతో నమోదైనవి 443 వెరసి 1,095 ఉన్నట్లు గుర్తించారు. వీటిలో అత్యధికంగా రౌతులపూడి మండలంలో సున్నాతో 382, జంక్ క్యారెక్టర్స్‌తో 278 ఓట్లు ఉన్నాయి. ప్రత్తిపాడు మండలంలో సున్నాతో 74, జంక్ క్యారెక్టర్‌తో 18, శంఖవరం మండలంలో సున్నాతో 184, జంక్ నంబర్‌తో 141, ఏలేశ్వరం రూరల్‌లో సున్నాతో ఆరు ఉండగా ఏలేశ్వరం నగర పంచాయతీలో మాత్రం సున్నా, జంక్ క్యారెక్టర్స్‌తో నమోదైన ఓట్లు లేవు.

నియోజవర్గంలో ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
ప్రత్తిపాడు	31,420	31,771	3	63,194	67
ఏలేశ్వరం అర్బన్	11,334	12,267	4	23,606	22
ఏలేశ్వరం రూరల్	17,648	18,007	0	35,655	41
శంఖవరం	21,619	21,944	12	43,575	49
రౌతులపూడి	21,227	21,518	2	42,747	48
మొత్తం	1,03,248	1,03,248	21	2,08,776	227

సరిదిద్దుతున్న ఎన్నికల సిబ్బంది

ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బంది ఇంటింటా సర్వేలో గుర్తించిన లోపాలను సరిదిద్దే పనిలో తలమునకలయ్యారు. నియోజకవర్గంలో 92.236 గృహాల పరిధిలో 227 పోలింగ్ కేంద్రాలున్నాయి. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకూ నియోజకవర్గంలోని దాదాపు అన్ని గృహాలను బూత్ లెవెల్ అధికారులు సందర్శించారు. ఇంటి నంబరు సున్నా, జంక్ క్యారెక్టర్‌తో నమోదైన వాటిని సరిదిద్దుతున్నారు. సదరు ఓటరుకు సంబంధించి ఇంటి నంబర్ ఆధారం (ఆధార్, పాస్‌పోర్టు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కార్డులు)గా నకలు తీసుకుని, ఫారం – 8 ద్వారా సరిచేస్తున్నారు. నియోజకవర్గంలో మరణించిన, ఒకటి కంటే ఎక్కువ ఓటు హక్కు కలిగిన, శాశ్వత గ్రామాంతరం చెందిన వారు 4,539 మంది ఉన్నట్టు ఎన్నికల సిబ్బంది గుర్తించారు. 5,658 మంది ఓటర్ల చిరునామాలో మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంది. ఒకే ఇంటి నంబర్‌తో పది మందికి మించి ఉన్నట్లు అయితే వారికి వేరే ఇంటి నంబర్ కేటాయిస్తామని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

జూలై 21 నుంచి ఓటరు జాబితా సవరణ

- ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితా సవరణ ప్రక్రియ జూలై 21 నుంచి ప్రారంభమైంది.
- ఆగస్టు 21వ తేదీ వరకూ బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి జాబితా మేరకు ఓటర్ల వివరాలను పరిశీలించారు.
- ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, జాబితా సవరణ చేస్తారు.
- సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16 వరకు ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ నిర్వహిస్తారు. 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ.
- అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు ఓటరు జాబితా సవరణపై అభ్యంతరాలను స్వీకరిస్తారు.
- డిసెంబర్ 28 నాటికి అభ్యంతరాలు పరిష్కరిస్తారు.
- 2024 జనవరి 1వ తేదీన ఓటర్ల జాబితా సిద్ధం చేస్తారు.
- 2024 జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.

ఓటు నమోదు చేసుకున్న యువకులు

ఓటర్ల జాబితా సర్వేతో పాటు నూతన ఓటర్లను నమోదు చేశారు. నెల రోజుల పాటు ఇంటింటా నిర్వహించిన సర్వేలో నియోజకవర్గంలో 3,925 మంది నూతన ఓటర్లను గుర్తించారు. ఓటరుగా నమోదు కానీ, 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ల పూర్తయిన వారిని ఓటరు జాబితాలో చేర్చారు. ఇందుకు సంబంధించిన ఫారాలన్నీ బూత్ లెవెల్ అధికారుల వద్ద సిద్ధంగా ఉన్నాయని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

కొత్త ఓటర్ల నమోదు కొనసాగుతోంది



ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు కొత్త ఓటర్ల నమోదు కొనసాగుతుంది. సర్వేలో గుర్తించిన 3,925 మంది ఓటర్లను జాబితాలో చేరుస్తాం. ఓటరు జాబితా సవరణ నిష్పక్షపాతంగా జరుగుతోంది. ఓటరు జాబితాపై ఎటువంటి అపోహలకు చోటులేదు. సర్వే ద్వారా శాశ్వతంగా వలసవెళ్లిన, మృతి చెందిన, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉన్న, కొత్తగా వలస వచ్చిన వారిని గుర్తించాం.

– పీవీవీ గోపాలకృష్ణ, అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్, ప్రత్తిపాడు

రైతులు విధిగా ఈ–పంట నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు వీరబాబు

గోకవరం: రైతులు ఈ నెల 15వ తేదీ లోగా తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. తహసీల్దార్ సుగుణ, ఎంపీడీఓ పద్మజ్యోతి మాట్లాడుతూ అక్టోబర్ నెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారన్నారు. నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేసి వ్యవసాయశాఖకు అప్పగించాలన్నారు. మండల ఏఓ రాజరాజేశ్వరి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. పంట కోత ప్రయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు కసిరెడ్డి సతీష్, ఆకుల సుబ్రహ్మణ్యం, ఉద్యానవన శాఖ అధికారి రీని, వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ



లబ్ధిదారులకు కుట్టు మెషీన్, ధృవపత్రం అందజేస్తున్న సర్పంచ్ శ్రీలత

కిర్లంపూడి: ఏపీ ఎన్‌జీవో సంస్థ మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం అభినందనీయమని కిర్లంపూడి సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అన్నారు. స్థానిక కుమ్మరి వీధిలో స్వర్ణ సోషల్ సర్వీస్, సీఆర్‌పీఎఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు సోమవారం కుట్టుమెషీన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ ముఖ్య అతిథులుగా పాల్గొని శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మెషీన్లు, ధృవపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ పి.స్వర్ణలత మాట్లాడుతూ నిరుద్యోగ మహిళలకు 40 రోజుల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 50 మందికి రూ.7500 విలువ చేసే కుట్టు మెషీన్లు రూ.3200లకే అందజేశామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఫౌండర్ పాల్‌ప్రసాద్, స్థానిక నాయకులు గుడాల రాంబాబు, రాపేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



శంఖవరంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న ఎంపీపీ, అధికారులు

శంఖవరం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయంలో గర్భిణులకు, బాలింతలకు సోమవారం ఆయన పౌష్టికాహారం చేశారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 15 రోజులకు ఒక్కసారి పౌష్టికాహార కిట్లు అందిస్తున్నట్టు తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది ఎప్పటికప్పుడు బాలింతలకు, గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణశ్రీ, ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, మండల జేసీఎస్ అధ్యక్షుడు బుర్రలచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు తేటగుంటలో మంత్రి రాజా పర్యటన

తుని రూరల్: మండలంలోని తేటగుంటలో మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని సోమవారం మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటలకు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. అలాగే నవరత్నాలు–పేదలకు ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు. అనంతరం తేటగుంట –రౌతులపూడి రోడ్డు పునర్నిర్మాణానికి మంత్రి దాడిశెట్టి రాజా శంకుస్థాపన చేస్తారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- యర్రవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



యర్రవరంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని యర్రవరంలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, నీరుకొండ సత్యనారాయణ, దాసరి రమేష్, గుల్లంపూడి గంగాధర్, అలమండ చలమయ్య, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జగ్గంపేట: కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక హెడ్ కానిస్టేబుల్ పి.సూరిబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాజపూడి గ్రామానికి చెందిన పల్లంశెట్టి శివ సుబ్రహ్మణ్యం (27) స్థానిక భారత్ గ్యాస్ ఏజెన్సీలో పని చేస్తున్నాడు. అతనికి ఇంకా వివాహం కాలేదు. జీతం డబ్బులు ఇంట్లో ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన సుబ్రహ్మణ్యం ఈ నెల 7న జె.కొత్తూరు గ్రామ శివారులో పొలం వద్ద గడ్డి మందు తాగి విషయాన్ని అతని మిత్రులకు తెలిపాడు. దీంతో అతడిని స్నేహితులు జగ్గంపేట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి పల్లంశెట్టి భాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రౌతులపూడి: మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన ఓ మహిళ (24) పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు సోమవారం స్థానిక ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు. ఆమె కూతురి విషయంలో భర్తతో మాటమాటకు వచ్చి మనస్తాపంతో పురుగులు మందు తాగిందని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలి



ఫోక్స్‌పేటలో అటవీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న రేంజర్ కరుణాకర్, సిబ్బంది

గోకవరం: జాతీయ అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలని ఫోక్స్‌పేట రేంజర్ ఎమ్.కరుణాకర్ అన్నారు. జాతీయ అటవీ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సూదికొండ ఫోక్స్‌పేట రేంజర్ కార్యాలయంలో అటవీ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరుల ఆశయ సాధనకు సిబ్బంది కలిసికట్టుగా పని చేయాలన్నారు. అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి సుజాత, సెక్షన్ అధికారులు నూకరాజుదొర, డి.అప్పారావు, సిబ్బంది ప్రశాంత్, జగదీష్, మాణిక్యం, పద్మ, అరుణ, సుభద్ర, శ్రీను, మనోహర్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వైదిక కార్యక్రమాలు వైభవంగా జరిపించాలి



రత్నగిరిపై కామేశ్వరశర్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పర్వత, చైర్మన్ రోహిత్, ఈఓ అజాద్

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో నిత్యం జరిగే వైదిక కార్యక్రమాలు, స్వామివారి ఉత్సవాలు, వార్షిక కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా జరిగేలా కృషి చేయాలని దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మను ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ కోరారు. అన్నవరం దేవస్థానంలో సుమారు 45 సంవత్సరాలు వ్రతపురోహితుడిగా, కల్యాణ బ్రహ్మగా, వ్రత ఉపబ్రహ్మగా కామేశ్వరశర్మ సేవలందించారు. ఆయన వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడిగా ఐదేళ్లు సేవలందించేందుకు 2021లో ట్రస్ట్‌బోర్డు తీర్మానించింది. 2021 నుంచి 2022 వరకు ఏడాది పాటు ఆ పదవిలో కొనసాగారు. దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడిగా మూడేళ్ల పాటు ఆయన సేవలందించేందుకు దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఈ ఏడాది ఆగస్టులో మళ్లీ ఆదేశాలిచ్చారు. దీంతో కామేశ్వరశర్మను సోమవారం నిర్వహించిన దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశంలో ఎమ్మెల్యే పర్వత, ఆలయ చైర్మన్ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ సత్కరించారు. కామేశ్వరశర్మ తన అనుభవంతో ఇతర పురోహితులకు కూడా స్వామివారి వ్రతం, కల్యాణం తదితర విషయాల్లో శిక్షణ నివ్వాలని కోరారు. ఎమ్మెల్యే పర్వత, చైర్మన్, ఈఓలకు కామేశ్వరశర్మ కృతజ్ఞతలు తెలియచేశారు.

బంద్ విఫలం

తుని: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ ఇచ్చిన రాష్ట్ర బంద్ తుని నియోజకవర్గంలో విఫలమైంది. సోమవారం ఉదయం టీడీపీ శ్రేణులు పట్టణంలో పర్యటించి దుకాణాలు మూసి వేసి బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రైవేటు విద్యాసంస్థలు, వ్యాపారులు దుకాణాలను మూసి వేశారు. సాయంత్రం యథావిధిగా దుకాణాలు తెరిచారు. ఆర్టీసీ బస్సులు నడిచాయి. పోలీసులు టీడీపీ ముఖ్య నేతలను హౌస్ అరెస్ట్ చేయడంతో నాయకులు, కార్యకర్తలు బయటకు రాలేదు.

రౌతులపూడి: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి అరెస్టుకు నిరసన సోమవారం టీడీపీ శ్రేణుల చేట్టిన బంద్ మండలంలో విఫలమైంది. రౌతులపూడి ప్రధాన రహదారిలోని దుఖాణాలు, పాఠశాలలను టీడీపీ నాయకులు మూసివేయించారు.

ఏలేశ్వరం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అరెస్టును నిరసిస్తూ సోమవారం టీడీపీ శ్రేణులు నిర్వహించిన బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో బంద్ చేయగా పట్టణంలో దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు మూతపడ్డాయి. స్థానిక బాలాజీచౌక్ వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, టీడీపీ నేతలు బొదిరెడ్డి గోపి, మూదినారాయణస్వామి ఆధ్వర్యంలో ధర్నా చేసి నిరసన తెలిపారు.

కోటనందూరు: మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టీడీపీ పిలుపునిచ్చిన బంద్ సోమవారం పాక్షికంగా జరిగింది. టీడీపీ, జనసేన కార్యకర్తలు స్థానిక బస్టాండ్ సెంటర్లో దుకాణాలు మూయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూయించారు. తుని–నర్సీపట్నం రోడ్డులోని జగన్నాధపురం, బొద్దవరం సెంటర్ల వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు బైటాయించి నిరసన తెలిపారు. కాగా మూయించిన కొద్దిసేపటికే దుకాణాలు తెరవగా ఆర్టీసీ, ఇతర వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగించాయి.

జగ్గంపేట/గండేపల్లి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్ట్ నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణులు సోమవారం చేపట్టిన బంద్ జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో పూర్తిగా విఫలమైంది. రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు జగ్గంపేటలో బ్యాంకులు, వ్యాపార సంస్థలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను మూయించారు. మధ్యాహ్నం నుంచి యథావిధిగా వ్యాపార సంస్థలు తెరుచుకున్నాయి.

కిర్లంపూడి: మండలంలో బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. మండల కేంద్రమైన కిర్లంపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు షాపులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాలను మూసివేయించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎస్సై పి.ఉమామహేశ్వరరావు చర్యలు చేపట్టారు.

ప్రత్తిపాడు: మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడి అరెస్టును నిరసిస్తూ సోమవారం ప్రత్తిపాడులో టీడీపీ బంద్ చేపట్టింది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో రాస్తారోకో చేపట్టారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, దుకాణాలు మూతపడ్డాయి. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు బంద్‌లో పాల్గొని, మద్దతు తెలిపారు.

గోకవరం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ చేపట్టిన బంద్ సోమవారం గోకవరం మండలంలో విఫలమైంది. ఉదయం టీడీపీ నాయకులు ఆర్టీసీ డిపో వద్ద కొద్ది సేపు బస్సులను అడ్డుకున్నారు. అనంతరం బస్సులు యథావిధిగా నడిచాయి. ప్రైవేటు విద్యాసంస్థలు మూతబడ్డాయి. వారపు సంత యథావిధిగా కొనసాగింది. ప్రజలెవ్వరూ బంద్‌ను పట్టించుకోలేదు. ఎవరి పనులు వారు చేసుకున్నారు.



దానవాయిపేట తీరంలో ఎగసిపడుతున్న అలలు

తీరంలో అలజడి

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రంలో అలలు ఉవ్వెత్తున్న ఎగసి పడుతున్నాయి. మండలంలోని అద్దరిపేట, కొత్తపోడిపల్లిపేట, దానవాయిపేట, యర్రయ్యపేట, పంపాదిపేట, కొత్తపేట, పెరుమాళ్లపురం సముద్ర తీరాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో పాటు అలలు ఎగసిపడుతున్నాయి. ప్రతికూల వాతావరణ ప్రభావంతో మత్స్యకారులు వేటకు విరామం ఇచ్చారు. తమ బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. తీరప్రాంతంలో మత్స్యకారులను, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశామని తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం తెలిపారు.